బందిపోటు నాయకుడు

బొమ్మిడి అచ్చారావు

(గత సంచిక తరువాయి)

తెల్లవారింది.

తెల్లవార్లూ ఆలోచనలతోనే సతమతమయ్యాడు కిరణ్. గజేందర్ వుంటున్న రహస్య స్థావరం యెక్కడుందో అతని కంతుబట్టలేదు.

మొదట బయలుదేరిన స్థలంలోనే కళ్ళకు గంతలు కట్టేశాడు గజేందర్. కాసేపు వెనక్కి కాసేపు ముందుకి పక్కలకు నడిపించాడు. ఆ తర్వాత ఇక్కడికి నడిపించుకుంటూ తీసుకొచ్చాడు. అప్పుడుకూడా రెండుసార్లు ఎడమ పక్కకి మూడుసార్లు కుడిపక్కకి మలుపులు తిప్పించి అక్కడికి తీసుకొచ్చాడు.

కిరణ్ మస్తిష్కంలో అతనొచ్చిన దారి, గుర్తులు ముద్రపడిపోయాయి. బయటికి పోయేదారి పదేపదే మననం చేసుకున్నాడు. పెన్‌పహాడ్ కొండ ప్రాంతంలో ఎక్కడి నుంచో దారివుందిక్కడకు. అది యెక్కడ ప్రారంభ

మయిందో, సారంగ మార్గానికి స్టాపింగ్ పాయింట్ ఎక్కడో—అదే అంతుబట్టడం లేదు.

గజేందర్ లాంటి వాళ్ళు ఇంకా నలుగు రున్నారు—అతనుకాక వీళ్ళ అయిదుగురిమీద ఓ నాయకు డున్నాడు. అతడే సూత్రధారి. అరాచక పరిస్థితుల్ని సృష్టించి దేశ పరిస్థితిని అల్లకల్లోలం చేస్తూ ఖజానా నింపిస్తూన్న వ్యక్తి వేరేవున్నాడు.

ఎవరతను? స్వదేశీయుడా? విదేశీయుడా? ఎందుకీ దేశాన్ని ముఖ్యంగా తమ రాష్ట్రాన్ని దోచుకుంటున్నాడు.

సవాలక్ష ప్రశ్నలతో కిరణ్ మస్తిష్కంలో వేడెక్కి పోయింది.

“హల్లో బ్రదర్, రాత్రి నిద్ర బాగా పట్టిందా?” అంటూ లోనికొచ్చాడు గజేందర్.

కిరణ్ పలకరింపుగా నవ్వాడు.

“ఆఁ. చాలాబాగా పట్టింది. చక్కటి విందు భోజనం పెట్టించావు. ఆ తర్వాత మెత్తటి పరుపులతో పక్క ఏర్పాటుచేశావు. ఏనుగుల చేత తొక్కించినా మెలకువ రానంత గాఢంగా నిద్రపట్టేసింది” అన్నాడు.

గజేందర్ నవ్వాడు.

“నిన్ను మా ముఠాలో చేర్చుకోవటానికి బాస్ అనుమతి తీసుకోవాల్సి వుంది. నువు కాలకృత్యాలు తీర్చుకున్నాక బాస్ దగ్గరకు వెళ్దాం. ఆయన ఓ.కే. అన్నారంటే ఇక అంతా లైన్ క్లియరే! ఎవరైనా బాస్ ముందు ఓకే చేస్తేనేకాని మాలో కలవనివ్వరు. మొదట్లో నేను మరో ముఠా - ఇద్దరమే వుండేవాళ్ళం. తక్కిన ముగ్గురు తర్వాత బాస్ చేర్చుకున్నారు. వాళ్ళు

ఒకరు మహారాష్ట్ర, మరొకరు మధ్యప్రదేశ్, మరొకడు చంబల్ లోయ ప్రాంతానికి చెందిన పెద్ద గజదొంగల ముఠాకి చెందినవాడు. బాస్ ఈ మూడు ముఠాలని తమ ఆధిపత్యం కిందికి తెచ్చుకున్నాడు.

"ప్రస్తుతం అయిదు ముఠాలు ఇక్కడే అంటే ఆంధ్రాలోనే పనిచేస్తున్నాయి. ముఖ్యంగా మూడు ముఠాలు రాజధానిలో వున్నాయి. తక్కిన రెండు సంచార కేంద్రాల లాగా రాష్ట్రంలో అక్కడక్కడ దారిదోపిడీలు, మేజర్ బ్యాంకి దోపిడీలు కండక్టు చేస్తున్నారు" చెప్పాడు గజేందర్.

కిరణ్ శ్రద్ధగా వింటున్నాడు.

గజేందర్ చెప్పిన ప్రతి విషయం అతని మెదడులో శాశ్వతంగా రికార్డయిపోయాయి. అసలు సూత్రధారుడు యెక్కడుంటాడో, ఎలా వుంటాడో చూడాలి. అతన్ని పట్టుకుంటే చాలు, తక్కిన అందరి జాతకాలు బయటి కొస్తాయి.

గజేందర్ కిరణ్‌తో మళ్ళీ మరోసారి సిద్ధంగా వుండమని చెప్పి, ఎలక్ట్రానిక్ పరికరాలున్న చెంతకు వెళ్ళాడు.

కిరణ్ అతనికి కనిపించకుండా అనుసరించాడు. గజేందర్ టివీలాంటి సాధనం ముందు కూచొని ఏదో మీటను నొక్కాడు.

తెరమీద చలనం ఆరంభమయింది. కాసేపు అడ్డ గీతలు వచ్చి స్క్రీన్ మీద అంతా గందరగోళంగా కని పించింది. తర్వాత చిత్రం స్థిరంగా కనిపించింది. అందులో ముఖం కనిపించకుండా వీపుమాత్రమే కనిపించేటట్టు వెనక్కి తిరిగి కూచున్నాడో వ్యక్తి.

బహుశా అతనే గజేందర్ చెప్పిన సూత్రధారుడు-బాస్ కావచ్చునని వూహించాడు కిరణ్.

గజేందర్ యెదురుగా వున్న మైక్రోఫోన్ తీసి చేత పట్టుకున్నాడు. అందులో తన గురించే మెసేజ్ పంపిస్తూ తను సాధించిన ఘనకార్యాల్ని గురించి వాళ్ళ బాస్‌తో వర్ణించి చెపుతున్నాడు.

బాస్ గట్టిగా నేలతన్ని లేచినిలబడ్డాడు. ఆ చర్యను బట్టి అతనికి కోపం వచ్చిందని గ్రహించాడు కిరణ్.

అతనికెందుకు కోపం వచ్చిందో గజేందర్‌కి అర్థం కాలేదు మొదట్లో. అప్పుడు కూడా బాస్ ఇటు' తిరగ లేదు. వెనక పెట్టుకునే వున్నాడు.

హిందీలో గంభీరంగా వినపడింది. "నువ్వు నీ సావరంలోకి తీసుకొచ్చిన వ్యక్తి దొంగ కాడు, బందిపోటూ కాదు. అతను పోలీసుల తాలూకు మనిషి కావచ్చునని నే ననుమానిస్తున్నాను. బాగా అబ్జర్వ్ చెయ్యి. అనుమానము సే నా ప్రమేయం లేకుండానే అక్కడికక్కడే పాతెయ్యి. బీ కాషస్!" అని.

గజేందర్ ముఖంలో చకచక రంగులు మారిపోయాయి.

"మీ దగ్గరకు తీసుకువద్దా మనుకున్నాను. అయితే అక్కర్లేదా సార్?" అనడిగాడు గజేందర్.

"నో. అతని నిజస్వరూప మేమిటో నువ్వే ముందు కనిపెట్టు. నమ్మకస్తుడని అనిపిస్తేనే తీసుకురా! యే మాత్రం పిచ్చివేషాలు వేసినా నిర్దాక్షిణ్యంగా అతన్ని, అనుచరుల్ని కాల్చిపారెయ్యి" ఆజ్ఞాపించాడు బాస్. అతనుకూడా హిందీలోనే మాట్లాడుతున్నాడు.

కిరణ్‌కి పరిస్థితులు చేజారిపోతున్న అనుమానం వచ్చింది. బాస్‌కి అనుమానం వచ్చింది. గజేందర్ ఆ అను

మానాన్ని నివృత్తి చేసుకోవటానికి తనని ఏదైన పరీక్షలకి గురిచేయవచ్చు. ఒకసారి అనుమానం తలెత్తిదంటే ఇక తన ఉనికికే ప్రమాదం. వెంటనే ఈ చోటువదిలిపోవాలి.

కిరణ్ వెంటనే తన ఆలోచనను అమల్లో పెట్టేశాడు. పోలీసు సిబ్బందికి రహస్య సంకేతాలు పంపించాడు. వాళ్ళందరి దుస్తుల్లోను వైర్‌లెస్ పరికరాలు మినీవాచ్ రూపంలోను భద్రపరచబడ్డాయి. అవసరమైనపుడు సంకేతాలు పంపించుకోవటానికి ముందుజాగ్రత్త చర్యగా తనే అవి ఏర్పాటుచేశాడు—ఇక్కడి కొచ్చేముందు.

గజేందర్ ఇంకా స్క్రీన్ ముందే కూచుని ఏవేవో మాట్లాడుతున్నాడు. కిరణ్ అటు ఇటు చూశాడు. తన సిబ్బంది సిద్ధపడుతున్నారు. కిరణ్‌కి తాము లోనికివచ్చిన దారిని గుర్తుపెట్టుకుని మెల్లగా అటు అడుగులు వేశాడు. ఇదివరకు కుడిపక్కకు తిరిగిన మలుపులు ఇప్పుడు యెడమ పక్కకు వస్తాయి. అలాగే యెడమవైపు రెండూ కుడి వైపుకొస్తాయి.

కిరణ్ ముందు దారితీశాడు. వెనక సిబ్బంది అయితే వాళ్ళు రెండు మలుపులు తిరిగారో లేదో అలారంలాంటి సిగ్నల్ అదే పనిగా వినిపించింది. చకచక గజేందర్ మనుషులు చుట్టుముట్టేశారు. వారి వెనుకనుంచి గజేందర్ నవ్వుతూ ముందుకి వచ్చాడు.

"మైడియర్ ఫ్రండ్! నువ్విలాంటి సాహసమేదో చేస్తావని నాకు ముందే తెలుసు. అందుకనే నేను నా మనుషులకి సిగ్నల్స్ పంపించాను. నువ్వు తప్పించుకు పారిపోతావు" అన్నాడు గజేందర్. నవ్వుతున్న అతని ముఖం అకస్మాత్తుగా సీరియస్‌గా అయిపోయింది.

"నన్ను ఆకర్షించుకోవటానికి నీవైపు దైవర్టు చెయ్యటానికి నా వేషం వేసుకుని ఏవేవో దోపిడీలు చేసినట్టు చక్కగా నటించావన్నమాట! నేను నిజంగానే నువ్వు డెకాయిట్ ననుకుని నా స్థావరంలోకి తీసుకొచ్చి నా గుట్టుమట్లన్నీ చెప్పేశాను. బాస్ తో మాట్లాడుతుండగానే నాకు ముఖ్యమైన అనుమానం వచ్చింది.

"నువ్వు నా వేషం వేసుకుని దోపిడీలు చేశావు. నేను ఇలా వుంటానని నీకు నన్ను చూడకముందే ఎలా తెలుసు? అంటే నన్ను చూసిన వాళ్ళెవరో నీకు నా గురించి చెప్పివుండాలి. ఆ అవకాశం ఎవరికుంది? ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ కి! అతనే నన్ను ముఖాముఖి కల్సుకున్న పోలీసు ఆఫీసరు. మొన్న ఆ సంఘటన జరిగాకనే నువ్వు రంగంలోకి దిగావు. చకచక ఓ బ్యాంకుని, బస్సుని, శ్రీనివాస్ ఇంటినీ దోచావు ఉత్తుత్తినే.

"ఇప్పుడు బాస్ తో నిన్ను అక్కడికి తీసుకురమ్మంటారేమోనని అడిగితే నీ గురించి అనుమానం వెలిబుచ్చాడు. అప్పుడు స్ట్రైక్ అయింది—నా రూపం నీకెలా తెలిసిందా అని! సరిగ్గా అదే సమయంలో నువ్వు, నీ పోలీసు సిబ్బందితో పారిపోవటానికి ప్రయత్నించావు. కాని అమాయకుడివి. ఈ కత్తుల బోను నుంచి తప్పించుకోవటం తేలికకాదన్న నిజం నీకు తెలియదు పాపం! నీకు, నీ సిబ్బందికి ఇక్కడే సజీవసమాధి హోల్ సెల్ గా ఏర్పాటు చేస్తున్నాను. బీ రెడీ!"

గజేందర్ నవ్వు చాలా విచిత్రంగా వుంది.

9

ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ చేతికున్న ఎలక్ట్రానిక్ వాచీలో అలారం మోగింది. అతను ఉలిక్కిపడ్డాడు. ఇది

కిరణ్ దగ్గరున్న సెట్‌తో సంబంధాలు కలిగివుంది. కిరణ్ ప్రమాదంలో ఇరుక్కుంటే తనకి సిగ్నల్స్ పంపిస్తానన్నాడు.

ఇప్పుడు తన దగ్గరున్న అలారం మోగుతోంది. అంటే కిరణ్ ఏదైనా ప్రమాదంలో ఇరుక్కున్నాడా? అయితే యెక్కడ? ఆ విషయం తెలియదు. అయితే కిరణ్ పెన్ పహాడ్ దగ్గరకు వెళ్ళున్న విషయం తనకి తెలుసు. అక్కడ గజేందర్ స్థావరం యెక్కడుందో గుర్తు తెలుసుకుని తర్వాత తనకొచ్చి చెపుతానన్నాడు. ఆ ప్రయత్నంలో ప్రమాదంలో ఇరుక్కున్నాడన్నమాట!

శ్రీనివాస్ ఏమాత్రం ఆలస్యం చెయ్యలేదు. పదిమంది సిబ్బందితో బయల్దేరాడు. అవసరమైతే వెంటనే పెన్ పహాడ్ దగ్గరకు బయల్దేరి రావలసివుంటుందని మరో వంద మందికి ఆదేశాలిప్పించాడు హెడ్‌క్వార్టర్స్‌కి ఫోన్ చేసి. వందమంది కాదు, యెంతమంది కావలసివచ్చినా వెంటనే పంపుతామని మెసేజ్ వచ్చింది అక్కడినుంచి.

శ్రీనివాస్ సరాసరి పెన్ పహాడ్ దగ్గరికి చేరుకున్నాడు. కొండచుట్టూ నిర్మానుష్యంగా వుంది. రోడ్‌కి దూరంగా వుండటంవల్ల వాహనాల రద్దీ తక్కువ వున్నా దూరంనించి పోతుంటాయి. అక్కడ ఏం జరుగుతున్నదీ పట్టించుకునే అజవుండ దెవరికీ.

శ్రీనివాస్ కొండచుట్టూ ప్రతి అంగుళం వెతకవలసిందిగా సిబ్బందికి సూచనలిచ్చాడు. తనూ వెతకటం మొదలుపెట్టాడు. చుట్టూ రాళ్ళూ రప్పలు. బూట్లు స్లిప్ అయే అవకాశాలే యెక్కువ. జాగ్రత్తగా నిలదొక్కుకుని అందరూ కొండప్రాంతమంతా చకచక పరిశీలనగా వెతుకుతున్నారు.

అక్కడినుంచి రహస్య ద్వారమో, బిలంలాంటిదేదో వుంటుందని శ్రీనివాస్‌కి గట్టి నమ్మకం.

* * *

"మమ్మల్ని నమ్మి మాతో కలిసి మెలిసి ఆత్మీయంగా వుండే వాళ్ళకోసం ప్రాణం పెడతాం. మమ్మల్ని మోస గించిన వాళ్ళని మరణ హోమం చేస్తాం. మేం యెంత మంచివాళ్ళమో అంతటి రాక్షసులం! మనుషుల్ని దోచుకు తినే మాకు జాలి, కనికరం, కరుణ దయలాంటి మాటల కర్థాలు తెలియవు. నీ సిబ్బందితో బాటు భగవంతుడ్ని ప్రార్థించుకో! మీ అందరి సామూహిక సజీవ సమాధికి సన్నాహాలు పూర్తయ్యాయి" అన్నాడు గజేందర్ ఇంకా వికృతంగా నవ్వుతూ.

"మమ్మల్ని చంపడంవల్ల నీకేమిటి లాభం" కిరణ్ తాపీగా అడిగాడు.

"మిమ్మల్ని చంపకుండా వదిలేస్తే మాకింతా నష్టమే! మా సావకం గురించిన రహస్యం తెలుసుకున్నాక మళ్ళీ బతికి బయటపడటమే! అది జరగని పని. నీ కథ నీ అనుచర పోలీసు సిబ్బంది కథా ఇంతటితో సమాప్తం."

"నన్ను ప్రాణాలతో వదిలెయ్యి. నేను పోలీసులకి మీ సంగతి చెప్పను. వాళ్ళు అడిగినా తెలియదని చెబు తాను."

గజేందర్ పడీపడీ నవ్వాడు.

"పోలీసుల తరుపున ఇక్కడికొచ్చిన పోలీసువాడికి ఈ సంగతి చెప్పననటం భలే తమాషాగా వుంది."

"నేను పోలీసువాడిని కాదు."

"మరి....?" గజేందర్ కళ్ళలో ఆశ్చర్యం.

"వాళ్ళకు సాయం చేయటానికొచ్చిన ప్రయివేట్

డిటెక్టివ్‌ని."

"వ్వాట్‌? నీ పేరు ...?"

"కిరణ్‌."

"ఐ.సీ. ప్రఖ్యాత డిటెక్టివ్‌ కిరణ్‌ నువ్వేనా?"

"అవును. శ్రీనివాస్‌కి నాకు దోస్తీ వుంది. అతను కోరితే కాదనలేక ఇందులో దిగాను. అనవసరంగా తల దూర్చానని ఇప్పుడు బాధపడుతున్నాను. నువ్వు నన్ను ప్రాణాలతో వదిలేస్తే ఇప్పుడే పోయి నా పని నేను చూసుకుంటాను. మీ జోలికి రాను. మీ రెవరో ఏం చేస్తారో యెవరికీ యెంతమాత్రమూ చెప్పను."

"మరి నీ పోలీసు సిబ్బంది....?"

"వాళ్ళని నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో. నాకేం అభ్యంతరం లేదు."

"నిన్ను నమ్మమంటావా?"

"అది నీ ఇష్టం. ఇంత చెప్పినా నమ్మకపోతే నేనింకేం చెప్పి నిన్ను నమ్మించగలను?"

"ఇది మరో ప్లాన్‌కు ప్రారంభం కాదుగదా?"

"నిన్ను నమ్మించటానికేం చెయ్యమంటావ్‌ చెప్పు!"

"ఇదిగో, నీ అనుచరుడ్ని ఒకడ్ని—ఒకడ్ని చాలు—కాల్చి చంపెయ్యి, నమ్ముతాను."

"ఆల్‌రైట్‌. ఇదిగో ఇప్పుడే చంపేస్తాను!" డిటెక్టివ్‌ కిరణ్‌ రివాల్వర్‌ ఓ పోలీసుకి గురిచేశాడు.

"అహ, ఆ రివాల్వర్‌తో కాదు, ఈ గన్‌తో!" గజేందర్‌ తన దగ్గరున్న గన్‌ ఇచ్చాడు.

గన్‌ తీసుకుంటూనే మెరుపు వేగంతో దాన్ని తిరిగి గజేందర్‌కే గురిపెట్టాడు డిటెక్టివ్‌ కిరణ్‌. ఒక్క క్షణంలో పోలీసు అనుచరులు పొజిషన్‌లోకి వచ్చేశారు.

అందరి చేతుల్లోనూ గన్స్ వున్నాయి.

గజేందర్‌తో పాటు అతని అనుచరులంతా నిర్ఘాంత పోయారు ఊహించని ఈ చర్యకు.

"మీ రెవరైనా వెర్రివెర్రి వేషాలు వెయ్యబోతే నిరాక్షిణ్యంగా మీ నాయకుడ్ని కాల్చి పారేస్తాను. బీ కేర్‌ఫుల్!" అన్నాడు కిరణ్ గజేందర్ అనుచరుల్ని ఉద్దేశించి.

ఆయుధాలు తీసుకోబోయిన గజేందర్ అనుచరు లంతా నిస్సహాయంగా చేతులు పైకెత్తేశారు. తనని కవ్వించి రెచ్చగొట్టి తనమీదకే యెదురుతిరిగిన ఆ డిటెక్టివ్ సమయస్ఫూర్తికి, మేధాసంపత్తికి ఆశ్చర్యంతో తలమునక లవుతున్నాడు. మళ్ళీ పరిస్థితిని ఎలా అదుపు లోకి తీసుకోవాలా అని ఆలోచిస్తున్నాడు.

"కదలకు గజేందర్! నీ కాలికింద గోడపక్కనో రహస్య మీటలో, స్విచ్‌లో వుంటాయని నాకు బాగా తెలుసు. అతి తెలివికి పోయి ప్రాణాలు పోగొట్టుకోకు. యెంతోమంది ప్రాణాలుతీసిన నీవు అంత తేలిగ్గా చావ టానికి సిద్ధపడవని నా నమ్మకం" అన్నాడు కిరణ్.

కాలుపక్కకి జరపబోయిన గజేందర్ ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

కిరణ్ తన సిబ్బందితో వున్న వైర్‌లెస్ ఆపరేటర్ని పక్కగా పిలిచి ఏదో సూచన లిచ్చాడు. అతను తలూపి పక్క గదిలో వున్న టీవీ సెట్ దగ్గరకు వెళ్ళాడు. అక్కడి వైర్లు డిస్‌కనెక్టు చేశాడు. అక్కడున్న గజేందర్ మనుషుల్ని అప్పటికే పోలీసు సిబ్బంది గన్స్‌తో కవర్ చేసేశాడు. అక్కడి విషయాలు గ్రహించటానికి గజేం దర్ బాస్ స్థావరంలో వైర్‌లెస్ రిసీవన్స్ లేకుండా

చేసేశాడు ఆపరేటరు. రహస్యంగా గోడల్లో అమర్చబడ్డ కెమరాల్ని కనుక్కున్నాడు ఆపరేటరు. వాటిని కూడా తీసేశాడు.

అక్కడ ఆ క్షణంలో ఏం జరుగుతున్నదో బయట ప్రపంచానికి తెలిసే అవకాశం లేకుండా చేశాక తిరిగి పొడవు హాల్లోకి వచ్చాడు వైర్‌లెస్ ఆపరేటర్. కిరణ్ వంక చూసి తలూపాడు.

ఈ లోపల గజేందర్ అనుచరుల్ని ఓ పక్కగా సెదర్ చేశాడు కిరణ్. పోలీసు సిబ్బంది గన్స్ వాళ్ళందరికీ గురిపెట్టబడే ఉన్నాయి. గజేంద్రని కవర్ చెయ్యటానికి మరొకత్తెకని ఆదేశించి కిరణ్ వెనక వెనగ్గా అడుగులు వేస్తూ రహస్య ద్వారం వైపు నడిచాడు.

మూడు మలుపులు యెడమకు, రెండు మలుపులు కుడికి తిరిగాక ఓ చోట ఆగాడు. బహుశా ఇక్కడినించే తమను లోపలికి ప్రవేశపెట్టాడు. అంటే ఈ పరిసర ప్రాంతాల్లోనే యెక్కడో వుండాలి ప్రవేశ ద్వారం!

ఇంతలో కిరణ్ చేతిలవున్న ఎలక్ట్రాన్ పరికరంలో సిగ్నల్ రావటం మొదలయింది-అతని కళ్ళు మెరిశాయి. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తన మెసేజ్ రిసీవ్ చేసుకున్నాడన్నమాట. బయల్దేరి వస్తున్నాడని సంకేతాలు పంపించాడు. గుడ్!

కిరణ్‌కి గోడపక్కగా మీట కనిపించింది. దాన్ని ఒత్తాడు. కర్‌మన్న చప్పుడుతో మనిషి పట్టేంత ద్వారం తయారయింది. అంతవరకు వున్న రాతిగోడ పక్కకు జరిగింది.

అయితే ఇంతలో హాల్లోనించి కాల్పులు వినిపించి నిర్ఘాంతపోయాడు. బయిటికి తొంగిచూడబోయిన వాడల్లా

ఒక్క ఉదుటన పరుగెత్తుకుని హాల్లోకి వచ్చాడు.

గజేందర్ చేతిలో గన్ పొగలు కక్కుతోంది.

"స్టాప్ దేర్ మిష్టర్ కిరణ్! అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకోకు. నా గురి వ్యర్థంకాదు. నీ అనుచరుల్ని తుపాకీలు కిందపారెయ్యమని చెప్పు. లేకపోతే నేను నీ ప్రాణాల్ని నిలువునా తీసేస్తాను" అరిచి చెప్పాడు గజేందర్.

క్షణంలో పరిస్థితి తలకిందు లవటంతో ఏమనటానికి నోటమాటరాలేదు కిరణ్‌కి. అజాగ్రత్తగా వున్న తన అనుచరుడ్ని రైవట్టుచేసి అతని చేతిలోని గన్‌ని తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు గజేందర్. ఇద్దరు పోలీసుల్ని నేల కరిపించాడు కూడా.

చుట్టూ వున్న పోలీసు సిబ్బంది చేతుల్లో గన్స్ ఉన్నాయి. అవి గజేందర్ బృందానికి గురిచేయబడి ఉన్నాయి. అందుకే గజేందర్ తనకి తుపాకీ గురిచేసి ఆజ్ఞాపించగలుగుతున్నాడు.

కిరణ్ మనిష్కం తీవ్రంగా ఆలోచిస్తోంది. ఈ విపత్కర పరిస్థితి నెలా యెదుర్కోవాలి? చూడగా శ్రీనివాస్ ఇంకా ఇక్కడికి చేరినట్టులేదు!

"ఊ! వెంటనే ఆదేశాలివ్వు. వన్....టూ...."

• • •

శ్రీనివాస్ తన సిబ్బందితో పెన్‌పహాడ్ చుట్టూ వెతుకుతున్న సమయంలో కర్‌మన్న చప్పుడు దాని వెంట చిన్న బిలంలాంటి ద్వారం తెరుచుకోవటం కనిపించింది.

సరిగ్గా అదే సమయంలో సొరంగం లోపలినుంచి గన్ పేలిన శబ్దాలు వినిపించాయి.

మౌనంగా తన సిబ్బందికి సైగచేసి పిలిచాడు. అందరు

బిలం దగ్గరకు చేరారు. ముందు శ్రీనివాస్, ఆ తర్వాత ఒకరొకరుగా బిలం లోపలికి దిగారు. లోపల పాడవు పాటి హాలు అక్కడ జనం కనిపించారు. అందరూ రివాల్వర్స్ పొజిషన్‌లోకి తెచ్చుకున్నారు.

శ్రీనివాస్ మెల్లగా అడుగులువేస్తూ ముందుకి నడిచాడు. అక్కడ ఎదురుగా గజేందర్, పక్కగా నిలబడి కిరణ్ వున్నారు. గజేందర్ గన్ కిరణ్‌కి గురిపెట్టి ఉన్నాడు.

"వన్ ....టూ ...." అంటున్నాడు గజేందర్.

సరిగ్గా అదే సమయంలో శ్రీనివాస్ చేతిలోని రివాల్వర్ రెండుసార్లు గర్జించింది. గన్ వదిలేసి 'అబ్బా' అంటూ రెండో చేత్తో గన్ పట్టుకున్న చేతిని అదిమి పట్టుకుని నేలమీద కూర్చుండిపోయాడు గజేందర్.

కిరణ్ వెనుతిరిగిచూసి శ్రీ ని వా స్ ని పలకరింపుగా చూసి నవ్వాడు.

క్షణంలో పరిస్థితి అదుపులోకి వచ్చేసింది.

10

టీవీ ముందు కుర్చీలో గజేందర్ కూచుని ఉన్నాడు. కిరణ్, శ్రీనివాస్ బంధింపబడి ఉన్నారు. ఓ పక్కగా వరసగా గోడకు చేర్చి పోలీసులు పెడరెక్కలు విరిచి కట్టబడి నిల్చున్నారు. వాళ్ళందరికీ గురిపెట్టిన గన్స్‌తో గజేందర్ అనుచరులు వేటకుక్కల్లా చూస్తున్నారు.

టీవీ స్క్రీన్‌మీద మళ్ళీ చలనం ఆరంభమయింది. అక్కడున్న యెలక్ట్రానిక్స్ యంత్రాలు మళ్ళీ పని చెయ్యటం ప్రారంభమయ్యాయి.

స్క్రీన్‌మీద బాస్ వీపు వెనక్కి పెట్టుకుని అలవాటైన తీరులో కూచుని వున్నాడు.

"సార్, గజేందర్ మాట్లాడుతున్నాను" అన్నాడు గజేందర్.

"చూస్తున్నాను. దాదాపు గంటసేపు నీతో మాకు రిలేషన్స్ తెగిపోయాయి. కారణమేమిటి?" అడిగాడు బాస్.

"చూస్తున్నారు కదా సార్, ఈ పోలీసువాళ్ళ ఆగడం! వీళ్ళంతా మనమీదికి దాడి వచ్చారు. ముందుగా కిరణ్ అనబడే ఓ డిటెక్టివ్ మన జాడ కనుక్కోవ టానికి వచ్చాడు. మీరు హెచ్చరించాక తెలిసింది—నా వేషంలో ఇన్ని హాపిడీలు చేసినవాడే ఈ కిరణ్ అని!

సరే, మీరు చెప్పిన వెంటనే అతన్నీ అతని అను చరుల వేషంలో వచ్చిన పోలీసుల్ని పట్టి బంధించాం. ఇంతలో ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మరి కొంతమంది పోలీ సులతో యెలా కనిపెట్టాడో మన స్థావరం కనిపెట్టి లోపలికొచ్చేశాడు. ఇదిగో ఈ పక్కన శ్రీనివాస్ అతని డిటెక్టివ్ ఫ్రండు కిరణ్‌ని బంధించేశాం. ఆ పక్కన పోలీసుల్ని బంధించాం. కిరణ్‌తో వచ్చిన పోలీసు అను చరుల్ని బంధించి పక్క గదిలో పడేశాను. ఏం చెయ్య మంటారో అర్థర్నివ్వండి బాస్!" అన్నాడు గజేందర్.

"వెరీగుడ్! మిస్టర్ గజేందర్! నాకున్న అయిదుగురు అసిస్టెంట్సులోను నువ్వు నాకు నచ్చావు. నిన్ను త్వరలో నా పార్ట్‌నర్‌గా చేసుకుంటాను. నీకు తక్కిన నలుగురు అసిస్టెంట్సుగా ఉంటారు. ఈ పోలీసువాళ్ళు మరీ జిత్తుల మారి వాళ్ళు. వీళ్ళని ఏవిధంగా చంపెయ్యాలో నేను ఆలోచించి చెపుతాను.

"మన స్థావరం వాళ్ళ దృష్టిలో పడిపోయింది. కాబట్టి ఇకమీదట ఆ స్తమాను వాళ్ళు వెన్‌పహాడ్ చుట్టూ

మాటు వేస్తూంటారు-కాబట్టి మన స్థావరాన్ని నాశనం చేసి షిఫ్టు అయిపోవటం మంచిది. అది ఈ రాత్రే జరగాలి. ఈ రాత్రికి నీకు అవుట్ డోర్ డ్యూటీ వెయ్యటం లేదు. ఆ డ్యూటీస్ తక్కిన నలుగురు తమ టీమ్‌తో చూసుకుంటారు. నువ్వు అటెంటివ్ గా ఈ పోలీసువాళ్ళను కనిపెట్టుకునివుండు. యెప్పుడు నీ పని మొదలుపెట్టాలో నేను మళ్ళీ చెబుతాను" అన్నాడు బాస్.

"అలాగే బాస్ మీ ఆర్డర్స్ కోసం యెదురు చూస్తుంటాను" అన్నాడు గజేందర్.

స్క్రీన్ మీద సీన్ చెదిరిపోయింది.

ఆ హాలులో బయటి ప్రపంచానికి మళ్ళీ రిలేషన్స్ తెగిపోయాయి.

అంతవరకు గజేందర్ కూచున్న కుర్చీకింద పడుకుని అతని వెన్నుకి గురిచూసి గన్ పట్టుకుని వున్న పోలీసు కానిస్టేబిల్ బయటికి వచ్చాడు.

గజేందర్ గాజు కళ్ళతో కిరణ్ వంక చూసి, "మీరు చెపుతున్నట్టే చెప్పానుకదా? ఇకనైనా నన్ను ప్రాణాలతో వదిలెయ్యండి" అన్నాడు గజేందర్.

కిరణ్ పకపక నవ్వాడు. "ఎందరో అమాయకుల ప్రాణాలు నిర్దాక్షిణ్యంగా తీసేసిన నువ్వు నీ ప్రాణం అనేసరికి యెంత తీపి చూపిస్తున్నావు? అమాయకుల్ని దోచుకుని వాళ్ళ ప్రాణాలు హరించినపుడు నీకు అలాంటి ఒకరోజు యెదురవుతుందని అనిపించలేదా?" అన్నాడు.

ఇంతలో సార్జెంట్ శివం శ్రీనివాస్ దగ్గరకొచ్చి, "సార్, వీడి అనుచరులందర్నీ పగ్గాలతో లింకు చేసి కదలకుండా కట్టేశాం. ఏం చేద్దామంటారు? అనడిగాడు.

"పక్క గదిలో వుంచండి. ఇదిగో ఈ పోలీసుల

వేషంలో ఉన్న అనుచరుల్ని కూడా లింకుచేసి అక్కడే పడెయ్యండి" అన్నాడు శ్రీనివాస్.

అంతవరకు పోలీసు వేషాల్లో గోడకు బంధింపబడి ఉన్న గజేందర్ అనుచరుల్ని, గజేందర్ అనుచరుల వేషాల్లో వుండి గన్స్ పోలీసు వేషగాళ్ళకి గురిచేసిన శ్రీనివాస్ సిబ్బంది డ్యూటీలు మార్చుకున్నారు. వాళ్ళ యూనిఫారమ్స్ తిరిగి ధరించారు.

"నిన్ను క్షేమంగానే వదిలేస్తాం. అయితే మీ బాస్ పేరు, అతనుండే చోటు, నీతోటి నలుగురు అసిస్టెంట్స్ వివరాలు, వాళ్ళ స్థావరాలు మాకు చెప్పు, చాలు. తక్కిన పని మేము చూసుకుంటాం" అన్నాడు కిరణ్.

"చెప్పకపోతే...." మొండితనం ధ్వనించింది గజేందర్ గొంతులో.

శ్రీనివాస్, కిరణ్ ఒక్క క్షణం ఆశ్చర్యపోయారు. అంతవరకు పిల్లిలా ఉన్న గజేందర్ గొంతులో వూహించని ధైర్యం, తెగింపు ధ్వనించటం చూసి కారణం వూహించటానికి విఫలప్రయత్నం చేశారు.

"చెప్పకపోతే ఏం చేస్తామో నీకు తెలుసు. నిన్ను చిత్రవధ చేస్తాం. నీ గోళ్ళు మాంసంతోపాటు నరికి కారం పూస్తాం. నీ ముఖానికి నిలువుగా అడ్డుగా కత్తితో కోసి రక్తం బొట్లు పెడతాం. దానిమీద కూడ చల్లగా వుండేందుకు కారం వగైరా అద్దుతాం. తర్వాత ఒక్కొక్కటిగా నీ అవయవాలు చిన్న చిన్న ముక్కలుకోసి తీసేస్తాం. ఇంకా...." శ్రీనివాస్ మాటలు ఇంకా పూర్తి కానేలేదు. గజేందర్ దుస్తుల్లోంచి ఓ ఎర్రటి క్యాప్సూల్ తీసి నోటిలో వేసుకున్నాడు. మరుక్షణం విరుచుకుని పడిపోయాడు.

కిరణ్ శ్రీనివాస్ ఒక్క ఉదుటన్న పోయి అతన్ని పట్టుకునేలోపల నిలువుగా నేలమీద పడిపోయాడు. కిరణ్ అతని నాడిపట్టుకుని చూశాడు.

గజేందర్‌లో చలనం ఆగిపోయింది. నోటివెంట నురుగు వచ్చింది.

"పూర్ క్రీచర్! హై నేడ్ శాపుల్స్ మింగేశాడు" అన్నాడు కిరణ్.

శ్రీ ని వా స్ అయోమయంగా చూశాడు. "ఉన్న ఒక్క ఆధారమూ పోయింది. వీడినడ్డుపెట్టుకుని వీడి బాస్‌ని, తక్కిన నలుగురు నాయకుల మఠాని పట్టుకుందామని యెంతగానో ఆశపడ్డాను. అంతా తలకిందులయింది" అన్నాడు నిరాశగా.

"డోంట్ అప్‌సెట్ మై డియర్ ఇన్‌స్పెక్టర్! 'బాస్' స్థానంలో ఉన్న వ్యక్తి యెవరో నాకు క్లూ అందిపోయింది. అయితే అది కన్ఫర్మ్ కావాలి అంతే!" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ విస్మయంగా చూశాడు. "ఎవరో తెలిసిపోయిందా, వాటే వండర్! ఆ బాస్ ఎవడో ముఖ్యంగా మొహం కనపడకుండా జాగ్రత్త తీసుకుంటున్నాడు కదా! ఎలా గమనించావు?" అన్నాడు.

"మొహం చాటేసినంతమాత్రాన గొంతు గుర్తించలేమా? ఎంత మార్చి మాట్లాడాలని ప్రయత్నించినా ఒక్కొక్కరికి ఒక్కో రకమైన మేనరిజం ఉంటుంది. మాటతీరులోనో, నిల్చున్నతీరులోనో, మూవ్‌మెంట్స్‌లోను ఓ ప్రత్యేకమైన అలవాటు ప్రదర్శిస్తుంటారు. ఈ బాస్ మాటిమాటికీ యెడమ చెవిని నులుముకుంటున్నాడు. ఇలాంటి అలవాటు అతి కొద్దిమందికి ఉంటుంది. అటు

వంటి వ్యక్తి నీకెవరైనా తటపడ్డారా?"

శ్రీనివాస్ ఆలోచిస్తున్నాడు.

"వెనకనుంచి కూచునివున్నా అతను చెవి నులుము కోవటం స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాదు, కొంచెం అతని ముఖ కవళికలు కూడా చూచాయగా నాకు కనిపించాయి. దాన్నిబట్టి కూడా ఆ వ్యక్తి యెవరో నేను గుర్తుపట్టాను" అన్నాడు కిరణ్.

"అదెలా?" శ్రీనివాస్ అడిగాడు.

"వెరీ సింపుల్. ఆ బాసి కూచున్న కుర్చీకి ఎదురుగా గ్లాస్ డోర్స్ వున్న అల్మాయిరా వుంది. ఆ అల్మాయిరా అద్దంగుండా అతని ముఖం కనిపిస్తోంది. అయితే మామూలు అద్దంలో కనిపించినంత స్పష్టంగా వెనక కెమికల్ పూయని అద్దంలో ప్రతిబింబం స్పష్టంగా కనపడదు కదా! అయినా ఆ కాస్త అస్పష్టతలోనే అతని పోలికలు నేను గుర్తుపట్టాను. అతను మనందరికీ బాగా తెలిసిన వ్యక్తే!"

శ్రీనివాస్ టెన్షన్ భరించలేక, "ఎవరో గుర్తుపట్టలేకపోతున్నాను. యెవరతను?" అనడిగాడు. కిరణ్ చిన్నగా చెప్పాడు. శ్రీనివాస్ నమ్మలేనట్లు చూశాడు.

ఇంతలో ఎలక్ట్రాన్ మెషీన్ల పైభాగంలో ఎర్రటి బల్బు వెలిగింది.

కిరణ్ ఆపరేటర్ని పిలిచాడు. "బాస్‌నుంచి మెసేజ్ వస్తున్నట్టుంది. పైన బల్బు వెలిగింది...." అన్నాడు.

పోలీసు ఆపరేటరు చకచక బాస్‌తో రిలేషన్స్ రీస్టోర్ చెయ్యటానికి ప్రయత్నించాడు. కాని యెక్కడో పొరపాటు జరిగింది. ఎంతకీ కనెక్షన్ దొరకలేదు. స్క్రీన్ మీద సీన్ పడలేదు. మెషీన్‌కున్న లైట్సుకూడా వెలగలేదు.

ఆపరేటర్ కంగారుగా పరీక్ష చేస్తున్నాడు. కిరణ్ అతని అవస్థ గమనించాడు. శ్రీనివాస్ వంక తిరిగి, "ఇక్కడ పనిచేసే గజేందర్ ఆపరేటర్ ఒకామె వుందిగా ఆమెని పిలిపించు" అన్నాడు.

శ్రీనివాస్ సార్జెంటు శివాన్ని పిలిచి చెప్పాడు. శివం కాసేపట్లో ఆ అమ్మాయిని తీసికొచ్చాడు. ఆమెను కూడా చేతులు కట్టేసి బంధించి వుంచారు

ఆమె హాల్లోకి వస్తూనే, "మెసేజ్ ఫ్రంబాస్!" అన్నది.

"మెషీన్ ఆపరేట్ చెయ్యొద్దు. ఆ మెసేజ్ బాస్ నించి వస్తున్నదేనా, కాదా అన్న విషయం కన్ఫర్మ్ చెయ్యి, చాలు!" అన్నాడు కిరణ్.

"ఎస్సార్! ఇటీస్ ఫ్రం బాస్!" అన్నదామె కచ్చితంగా.

కిరణ్ తనతో తీసుకొచ్చిన పోలీసు సిబ్బందిని పిలిచి, "మీరందరూ గజేందర్ అనుచరుల వేషాలు వేసుకోండి. ఈ హాల్లో అక్కడక్కడ గన్స్ పట్టుకుని ఓ నలుగురు నిలబడండి" అన్నాడు.

వాళ్ళు వెంటనే దుస్తులు మార్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. కిరణ్ చకచక గజేందర్ దుస్తులు తను వేసుకుని, మేకప్ కిట్ తెరిచి అప్పటికప్పుడు గజేందర్‌గా మేకప్ చేసుకున్నాడు. శ్రీనివాస్ అతనివంక ఆరాధనగా చూస్తున్నాడు. అతని చేతులు వేగానికి, అతి చురుగ్గా కదులుతున్న అతని చర్యలకి ముగ్ధుడవుతూ చూస్తున్నాడు.

కిరణ్ మూడు మూర్తులా గజేందర్‌లా వేషం మార్చుకున్నాక గజేందర్ ఆపరేటర్‌తో, "మెషీన్ యెందుకో

అవుటాఫ్ ఆర్డర్‌లో వుంది. మా ఆపరేటర్‌కి ఫాల్టు యెక్కడుందో చెప్పి పక్క గదిలోకి వెళ్ళిపో! ఇక్కడ మా పని కాగానే నిన్ను క్షేమంగా వదిలేస్తాం" అన్నాడు.

ఆమె కృతజ్ఞతగా నమస్కారం పెట్టి, "నన్నీ గజేందర్ బలవంతంగా కిడ్నాప్ చేసి తెచ్చాడు సార్! నేను టెలికమ్యూనికేషన్స్‌లో డిప్లమా కోర్సు చదువుతున్నాను. నేను ఈ మెషీన్స్ ఆపరేట్ చేయటానికి తనకి అవసరమని నన్ను తీసుకొచ్చాడు. నా తల్లిదండ్రుల్ని చంపుతానని బెదిరించి నాచేత బలవంతాన ఇక్కడ పనిచేయిస్తున్నాడు" అన్నది.

కిరణ్ ఆమెవంక కరుణగా చూసి, "అలాగా! మేం ఇంతసేపూ నిన్నుకూడా శత్రువుగానే పరిగణిస్తున్నాం. అయితే ఆడపిల్లవనే జాలితో నిన్నుమాత్రం వదిలెయ్యాలనుకున్నాం—అదికూడా మా పనంతా పూర్తయ్యాక. నీ సంగతి తెలిసిందికదా, నిన్ను మీవాళ్ళ వద్దకు మా మనుషుల్ని తోడిచ్చి క్షేమంగా పంపిస్తాం" అన్నాడు.

"మీరే నాకు దేవుడు. మీ మేలు ఈ జన్మలో గుర్తుపెట్టుకుంటాను" అన్నదామె.

కిరణ్ ఈలోపల ఏదో గుర్తొచ్చి "చూడమ్మా, నీకు బాస్ గురించి, గజేందర్‌లాంటి మరికొంతమంది బందిపోటు నాయకుల గురించి వివరాలు తెలుసా?" అనడిగాడు.

"బాస్ ఎవరో, ఏమిటో ఎవరికీ తెలియదు సార్! ఏ ప్రాంతం వాడోకూడా తెలీదు. హిందీలో మాట్లాడుతాడుకాని తెలుగు ఏక్సెంట్ వినిపిస్తుంది. గజేందర్ లాంటివాళ్ళు మరి నలుగురు నాయకులున్నారు. వీళ్ళు

అయినగురు బాస్ చెప్పే ఆజ్ఞలను అమలు పరుస్తుంటారు" అన్నదామె.

"వాళ్ళ పేర్లు వివరాలు చెప్పగలవా?"

ఆమె వరసగా వాళ్ళ పేర్లు వాళ్ళ స్థావరాల వివరాలు చెప్పింది. శ్రీనివాస్ చకచక నోట్ చేసుకున్నాడు.

"ఇప్పుడు చూడు, మెషీన్ ఎక్కడ పాడయిందో?" అన్నాడు కిరణ్.

ఆమె మెషీన్ వంక చూస్తూనే, "ఈ మెషీన్ కి సెపరేట్ మెయిన్, ఫ్యూజ్ ఉన్నాయి సార్! అవి ఆఫ్ చేసి ఉన్నాయి. సప్లై ఎలా ఉంటుంది?" అన్నది.

శ్రీనివాస్ తమ వైర్ లెస్ ఆపరేటర్ వైపు కోపంగా చూశాడు. అతను తల దించుకున్నాడు.

కిరణ్ కూల్ గా చూసి, "అదే మంచిదయింది. లేకుంటే మనం మన నిజ స్వరూపాలతో 'బాస్' కళ్ళ పడిపోయిందేవాళ్ళం! మెషీన్ పని చెయ్యలేదు గాబట్టి బతికిపోయాం. ఈలోపల వేషాలు మార్చుకుని జాగ్రత్తపడ్డాం" అన్నాడు. శ్రీనివాస్ ప్లీజింగ్ గా చూశాడు.

"చాలా థాంక్సమ్మా! నీకు డిపార్టుమెంటు ఋణపడి ఉంటుంది. వీలైతే డిపార్టుమెంటులోనే ఆపరేటరుగా అబ్జార్బ్ చేసుకోవటానికి రికమెండ్ చేస్తాను" అన్నాడు కిరణ్. ఆమె కృతజ్ఞతగా చూసింది.

"గజేందర్ శవాన్ని కూడా పక్క గదిలో ఉంచండి" అన్నాడు కిరణ్ సార్జెంట్ తో.

11

"క్యా గజేందర్, ఇతా్నదేర్ హోగయా క్యోం? హై పంద్రామినట్స్ సే మెసేజ్ భేజ్ రహాహూఁ

రెస్పాన్స్ నహీం హైం క్యా కర్ రహే తుమ్‌లోగ్?"
అంటున్నాడు బాస్ కోపంగా.

కిరణ్ గజేందర్ గొంతు అనుకరిస్తూ హిందీలోనే జవాబిచ్చాడు. "ఏం చెయ్యమంటారు సార్, మెషీన్ ట్రబు లిచ్చింది. ఇప్పుడే మీనుంచి మెసేజ్ వస్తున్న సిగ్నల్స్ వచ్చాయి. వెంటనే అటెండవుతున్నాను" అన్నాను అపాలజిన్‌గా.

శ్రీనివాస్ బాస్ ముఖ కవళికల్ని మాటని గుర్తు పెట్టటానికి ప్రయత్నిస్తున్నాడు. అతనే ఈ బాసా? ఎంత ఘోరం! శ్రీనివాస్ రక్తం మరిగింది.

ఇంతలో ఉరుములా వినిపించింది బాస్ కంఠస్వరం.

"మిస్టర్ కిరణ్, గజేందర్‌లా ఎంత బాగా నటించా లనుకున్నా నువ్వెవరో తెలిసిపోయింది" అని.

కిరణ్ శ్రీనివాస్ నివ్వెరపోయారు.

"ఏమిటి బాస్, ఏమిటి మీరంటున్నది?"

"గజేందర్ మహారాష్ట్రంవాడు. అతను హిందీలో మాట్లాడినా మరాఠీలానే వుంటుంది. నీ గొంతులో అచ్చమైన తెలుగుదనం ధ్వనిస్తున్నది. నువ్వు హిందీలో ఎంతగా గొంతుమార్చి మాట్లాడినా అది నీ నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. అదీకాక నీ వెనక నిల్చుని వున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ చాలా ఫ్రీగా, యెలాంటి బంధనాలు లేకుండా ఉన్నాడు. ఈ రెండూ నిన్ను పట్టిచ్చాయి. కాసేపట్లో మీ అందరి కథా ముగిసిపోతుంది...." అన్నాడు బాస్.

తెరమీద సీన్ మాయమయింది. లోపల అంతా అంధకార మయిపోయింది.

కిరణ్ ఒక్కసారిగా కూచున్న చోటునుంచి లేచి

"మిష్టర్ శ్రీనివాస్! ఆపద ముంచుకొస్తోంది. మనసంగతి బాస్ మహాశయుడికి తెలిసిపోయింది. అక్కడనుంచే ఈ అండర్ గ్రౌండ్‌ని ఆపరేట్ చేయగలుగుతున్నాడు. మనల్ని బయటికి తప్పించుకోకుండా ఇక్కడే సమాధి చేసేస్తాడు—కమాన్ హారియప్!" అన్నాడు.

"మనవాళ్ళతోబాటు, గజేందర్ మనుషుల్ని కూడా బయటకు తీసుకుపోవాలా?" అన్నాడు శ్రీనివాస్.

"అందర్నీ బయిటకి తీసుకుపోవాలి. గజేందర్ మనుషులు సంఘవిద్రోహులు. అయినా వాళ్ళను శిక్షించే హక్కు మనకిలేదు. అది కోర్టు చెయ్యాల్సిన పని!...." కిరణ్ చెప్పుండగానే యెక్కడినుంచో గాస్ బుసబుస మంటూ చొచ్చుకురాసాగింది.

"శ్రీనివాస్! గాస్ వదులుతున్నాడు. స్విచ్‌లుగాని, మీటలుగాని నొక్కవద్దు. లైటర్స్‌గాని, మేచ్ బాక్స్ గాని వెలిగించొద్దు సజీవ సమాధి అయిపోతాం" హెచ్చరించాడు కిరణ్.

అందరు ఒక్కసారిగా బిలద్వారంవైపు పరుగులు పెట్టారు. సార్జంటు శివం మరికొందరు కానిస్టేబిల్స్ సహాయంతో గజేందర్ అనుచరుల కాళ్ళబంధాలు తెంచేసి చేతుల బంధాలు మాత్రం అలాగే వుంచి బిల ద్వారం దగ్గరకు పరుగులెత్తించాడు.

ముందుగా పోలీసు సిబ్బంది ఆ' వెనక గజేందర్ సిబ్బంది బిలందాటుతుండగా ఒక్కసారిగా సొరంగంలో మంటలు లేచాయి. పెద్ద పేలుడు సంభవించింది. గజేందర్ అనుచరులు సొరంగం దాటేలోపలే పైనుండి పెద్ద పెద్ద బండలు మీదపడి సొరంగమంతా కిందికి కూలిపోయింది. ప్రాణాలు దక్కించుకున్నది ఆపరేటర్ ఒక్కతే!

బయటకి వస్తూనే కిరణ్ శ్రీనివాస్‌ను తొందర పెట్టాడు. "ఈసరికి బాస్ తక్కిన బందిపోటు నాయకు లకీ ఆదేశాలిచ్చి వుంటాడు. వాళ్ళు కూడా తమ స్థావ రాలు వదిలి సురక్షిత ప్రాంతాలకు పారిపోయి వుంటారు. మనం సరాసరి బాస్ నివాసానికి వెళ్ళాలి. అతన్ని అదుపులోకి తీసుకుంటే అన్ని విషయాలు బయట పడతాయి" అన్నాడు.

కిరణ్ శ్రీనివాస్‌లు సరాసరి బాస్ నివాసానికి సిబ్బందితో బయట నిలిచి వున్న వాహనాల మీద దూసుకుపోయారు.

12

"దొరగారు ఇంట్లో లేరు" అన్నాడు గేట్ దగ్గరున్న వాచ్‌మాన్.

"ఆ విషయం తెలుసు" అంటూ కిరణ్, శ్రీనివాస్‌లు అతన్ని తోసుకుని లోపలకు వెళ్ళారు. లోపల పనివాళ్ళు అడ్డుపడబోయారు. వాళ్ళని సార్జంటు శివానికి అప్పగించి లోపలకి దూసుకుపోయారు కిరణ్, శ్రీనివాస్.

పదినిమిషాల తర్వాత కిరణ్ కళ్ళు మెరిశాయి. నేల మీద గుల్లగా ఉన్నచోట బూటుకాలితో గట్టిగా తొక్కాడు. అతని అనుమానమే నిజమయింది. కింద ఏదో సొరంగమార్గముండి ఉండాలి! నేలమీద పరచబడి వున్న ఖరీదైన కార్పెట్‌ని తొలగించాడు.

గచ్చుమీద మూడడుగుల పొడవు మూడడుగుల వెడల్పు వున్న చతురస్రాకారపు రాతిపలక వుంది. దాన్ని పక్కకు తీసి పెట్టారు. కిందికి మెట్లున్నాయి.

గజేందర్ స్థావరాన్ని పోలిన పెద్ద హాలు, ఎలక్ట్రా నిక్ పరికరాలు, దానిముందు బాస్ హోదాలో కూచున్న

వ్యక్తి వాళ్ళ కళ్ళబడ్డారు.

"శ్రీనివాస్, ఎటాక్!" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్, కిరణ్ ఓకేసారి గాల్లోకి పిస్తోళ్ళు పేల్చారు. హడావిడిగా మెషీన్‌లోకి వంగి ఏవో ఆదేశాలిస్తూన్న బాస్ అదిరిపడి చూశాడు. అతని చుట్టూ చాలామంది అనుచరులు సాయుధులై ఉన్నారు. వాళ్ళు గన్స్ గురి పెట్టారు. అప్పటికే బిలబిలమంటూ పోలీసు బలగం నేల మాళిగలోకి దిగిపోయింది.

"మెడియర్ మాజీ నాయకా, కుశాలరావ్! నీ మనుషుల్ని ఆయుధాలు కింద పారెయ్యమను. లేకుంటే నీ శరీరం తుపాకీ గుళ్ళతో శిథిలమైపోతుంది, జాగ్రత్త!" అన్నాడు కిరణ్ హెచ్చరికగా. అతను, శ్రీనివాస్ తమ రివాల్వర్సు బాస్‌కే గురిపెట్టి ఉన్నారు.

చేసేదిలేక బాస్ యెడమచెవిని గట్టిగా నులిమేసు కుంటూ కసిగా బుసకొట్టాడు.

"మిస్టర్ కుశాలరావ్! ఇంకా పంతాలకు పోయి ప్రాణంమీదికి తెచ్చుకోకు. ప్రజానాయకుడిగా ఎంతో ప్రజాధనాన్ని స్వాహాచేశావు. ఈ రాష్ట్రానికి కీలకమైన హోదాలో కొన్నాళ్ళు పనిచేశావు. చివరికి ఆ ప్రజల మాన ప్రాణాలనే హరిస్తూ వాళ్ళ ఆస్తుల్ని, సర్వస్వాన్ని కొల్లగొడుతూ నువ్వు ఇంకా ఇంకా ఆస్తుల్ని కుళ్ళబెట్టు కుంటున్నావ్! నిన్ను ప్రజలు క్షమించరు. మారుమాట్లాడ కుండా సరెండరయిపో!" అన్నాడు కిరణ్.

కుశాలరావు అనబడే బాస్ చేసేదిలేక తన మనుషుల వంక చూశాడు. వాళ్ళు ఆయుధాలు కింద పారేశారు.

"అలాగే ఆ మెషీన్‌లో మీ అసిస్టెంట్సు రహమాన్, జోసెఫ్, ప్రసాద్ భోస్లే, బల్వంత్ రావులను కూడా నీ

నివాసానికి అర్జంటుగా రమ్మని కబురుచెయ్యి. మేము మళ్ళీ వాళ్ళను వెతుక్కుంటూ పోలేం. ఇప్పటికే బాగా అలిసిపోయాం" అన్నాడు శ్రీనివాస్ వ్యంగ్యంగా.

కళాలరావు శ్రీనివాస్ వంక గుర్రుగా చూశాడు.

13

"నీకు మన రాష్ట్రం, మనదేశంకూడా చాలా ఋణపడి ఉంది బ్రదర్! కళాలరావే బాస్ అని చాలా తెలివిగా ట్రేస్ చేశావు. దాంతో కేసు ముడివిడిపోయింది. మన రాష్ట్రానికి బందిపోటు దొంగల బెడద వదిలించి ప్రజా జీవితాన్ని మళ్ళీ ప్రశాంత వాతావరణానికి తీసుకొచ్చావు.

ఐ.జి.పి, కమిషనర్, పోలీసు ఉన్నతాధికారులు, మన ముఖ్యమంత్రి నిన్ను చాలా అభినందించారు. నీతో బాటు ఆ ఘనత నాకూ దక్కింది. కళాలరావే బాస్ అని ఎలా గ్రహించావో నా కిప్పటికీ సస్పెన్స్ గానే వుంది" అన్నాడు శ్రీనివాస్.

డిటెక్టివ్ కిరణ్ ఇంట్లో ఇద్దరు కూచుని ఉన్నారు. అప్పటిదాకా అభిమానులు, ఆత్మీయులు పుష్పగుచ్ఛాలు వేసి కిరణ్ సాధించిన అపూర్వ విజయానికే అభినందనలు, హారాన్ని వెలిబుచ్చి వెళ్ళారు.

పరిస్థితి ప్రశాంతం కాగానే శ్రీనివాస్ కిరణ్ ముందు తన సందేహాన్ని వెలిబుచ్చాడు.

కిరణ్ మందహాసం చేసి, "నేను ఇదివరకు చెప్పాను కదా ప్రతి మనిషికి కొన్ని మేనరిజమ్స్ జన్మత పట్టు బడతాయని, అవి చివరకు వాళ్ళని అంటి పెట్టుకుని వుంటా యని! కళాలరావు ఒక నాటి ప్రజానాయకుడు. అతనికి యెడమ చెవిని కుడిచేత్తో నులుముకునే అలవాటుంది. అతను ప్రజానాయకుడిగా మనందరికీ తెలుసు. అతని

అలవాట్లు కూడా మనందరికీ తెలిసే ఉంటాయి.

"అటువంటి అలవాటున్న మనిషెవరాని ఆలోచిస్తే నాకు వెంటనే కళాలరావే స్ఫురించాడు. ఆ అనుమానంతో పరిశీలించి చూడగానే అతని ముఖకవళికలు కూడా గుర్తు తెలిశాయి. అంతే, ముడి విడిపోయింది.

కళాలరావు ఒకప్పుడు రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించిన రాజకీయ నాయకుడు. అధికారం చేతిలో ఉండేది, లంచాలు బాగా మేశాడు.

గత ఎన్నికల్లో అతని పార్టీ ఘోరపరాపజయాన్ని చవిచూసింది. అధికారం వూడిపోయింది. గత ఎన్నికల్లో కొన్ని కోట్లు తనకోసం, తన పార్టీకోసం ఖర్చు పెట్టాడు. అదంతా మట్టిలో కలిసిపోయిన పన్నీరులా అయిపోయింది.

దాంతో డబ్బుకోసం కటకట ఏర్పడింది. కళాలరావు డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషించాడు. తన పార్టీ సహచరులతో మంతనాలు సాగించాడు. చివరికి దారి దోపిడీలు, బ్యాంకి దోపిడీలు, ఇళ్ళ దోపిడీలు అయితే లాభసాటిగా ఉంటుందని భావించాడు. మహారాష్ట్ర చంబల్ లోయల్లో ఉన్న బందిపోట్లు ఈ మధ్య మన రాష్ట్రంమీద, ముఖ్యంగా రాజధానిమీద పడి దోచుకుంటున్నారు. జనాన్ని భయభ్రాంతుల్ని చేస్తున్నారు. వాళ్ళని మెల్లిగా తమ చెప్పు చేతుల్లోకి తెచ్చుకున్నాడు కళాలరావు. తదితర పార్టీ సహచరుల అండదండలతో దిగ్విజయంగా దోపిడీలు నడిపిస్తున్నాడు.

కళాలరావు జరిపిస్తున్న దోపిడీల వెనక అంతర్గతంగా మరో అయిడియా వుంది. అదేమిటంటే ప్రస్తుత పాలనా యంత్రాంగాన్ని తారుమారు చేసి, ప్రజల్లో

ప్రస్తుత ప్రభుత్వానికున్న అఖండ విశ్వాసాన్ని, పేరు ప్రఖ్యాతుల్ని పాడు చెయ్యటానికి ఈ దోపిడీలు, హత్యలు, మత కలహాలు ఎంతో ఉపయోగపడతాయి. ఆ విధంగా ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలుచేయ్యాలని కుశాలరావు వంటి మాజీనాయకులు కలపన్నటంలో ఆశ్చర్యమేముంది?

ఓపక్క దోపిడీలవల్ల వచ్చే అపారమైన ఆస్తి, మరో పక్క తాము తిరిగి గద్దెనెక్కటానికి తీవ్రప్రయత్నం! వీటితో కుశాలరావు ఉచ్చం నీచంకూడా మరిచిపోయి, ఒకప్పుడు తనకు బ్రహ్మరథం పట్టిన ప్రజలకే ద్రోహం తలపెట్టాడు.

మరో అనుమానం నీలో తలెత్తవచ్చు. కుశాలరావు తన నివాసం నుంచే ఈ ఘోరాల్ని నడుపుతున్నట్టు నాకెలా తెలిసిందని. కుశాలరావు నివాస గృహం పక్కగా రైల్వేట్రాక్ వుంది కదా! అతను గజేందర్‌కి ఆదేశాలిస్తున్నప్పుడు ట్రెయిన్ కూత వినిపించింది సన్నగా.

అతను సొరంగంలో ఉండొచ్చునని అనుమానం రావటానికి కారణం, ట్రెయిన్ నడుస్తూండగా నేల అదురుతుంది కదా! అతనున్న నేలమాళిగ అదిరిన శబ్దం టీవీలో స్పష్టంగా వినిపించింది నాకు! దాంతో కుశాలరావు నివాస గృహం నా దృష్టిలో మెదిలింది. అంతే, కుశాలరావు తన నివాసంలోనే నేల మాళిగ తవ్వించి అక్కడి నుంచే కథంతా నడుపుతున్నాడని గ్రహించాను" అని చిరునవ్వుతో ముగించాడు డిటెక్టివ్ కిరణ్.

—: అయిపోయింది: —